## క్లుప్తంగా

### పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోటేశ్వర్



కాజీపేట: హనుమకొండ జిల్లా పెరిక సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నల్లపు కోటేశ్వర్ గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి అనిల్‌పై విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ల ఈశ్వర్‌కుమార్,కోశాధికారిగా దొమ్మాటి భాస్కర్‌లు ఎంపికయ్యారు.

### కేయూలో కారుణ్యనియామకం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో మాలిగా విధులు నిర్వర్తించే బషీర్ గత ఏప్రిల్‌లో మృతిచెందాడు. దీంతో ఆయన కుమారుడు మహ్మద్ షకీల్‌కు స్టోర్ కీపర్‌గా కారుణ్య నియామకం చేస్తూ కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. అతనికి ఫార్మసీ కాలేజీలో పోస్టింగ్ ఇచ్చారు. మంగళవారం వీసీ ప్రతాప్‌రెడ్డి అతడికి ఉత్తర్వులు అందజేశారు.

### ఎన్పీడీసీఎల్ సీవీఓను కలిసిన ఎస్టీ ఉద్యోగులు

హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్‌ను విద్యుత్ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం కలిశారు. విజిలెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ గౌరవాధ్యక్షుడు వాలునాయక్, కార్యదర్శి అజ్మీరా శ్రీరాంనాయక్, జవహర్, రాజశేఖర్, శ్రీకాంత్, సురేశ్, దయాకర్, శ్రీనివాస్, వెంకన్న, మహేష్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### అజిత్‌కు మల్టీపుల్ అవార్డు

హసన్‌పర్తి: హసన్‌పర్తికి చెందిన లయన్స్‌క్లబ్ సభ్యుడు డాక్టర్ అజిత్‌కుమార్‌ను మల్టీపుల్ అవార్డుతో సత్కరించారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మల్టీపుల్ 320 అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ ఇండియా కౌన్సిల్ చైర్మన్ ఘట్టమనేని బాబురావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

### డాక్టర్ వెంకన్నకు సన్మానం

హన్మకొండ కల్చరల్ : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా వరంగల్ సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్నను పీఠం విద్యార్థులు సన్మానించారు. మంగళవారం విద్యార్థులు ఆయనను శాలువాతో సన్మానించి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని బీసీ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం బీసీ అధ్యాపకుల సంఘం బాధ్యులు వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రంను సమర్పించారు. యూనివర్సిటీ జనాభా దామాషా ప్రకారం బీసీ అధ్యాపకులు 56 శాతం పరిపాలనా పదవులు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి తెలిపారు. వీసీని కలిసిన వారిలో బీసీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య, జనరల్ సెక్రెటరీ ఎర్రబొజ్జు రమేష్, బాధ్యులు తదితరులు ఉన్నారు.

### బాలల అక్రమ రవాణాను నిర్మూలించాలి

ఖిలా వరంగల్ : బాలల అక్రమ రవాణా నిర్మూలనకు పాటుపడాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం రంగశాయిపేటలోని లిటిల్ లారెన్స్ హైస్కూల్‌లో సాంఘిక సేవా సమితి కోఆర్డినేటర్ సుదర్శన్ ఆధ్వర్యంలో మానవ, బాలల అక్రమరవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తమై అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ కల్పన, ప్రిన్సిపాల్ రాజు, అనిత పాల్గొన్నారు.

### బీమా వెల్ఫేర్ బోర్డు ద్వారానే ఇవ్వాలి

ఖిలా వరంగల్: భవన నిర్మాణ కార్మికులకు పెంచిన ప్రమాద బీమా రూ.10 లక్షలు ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డు ద్వారానే ఇవ్వాలని, ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తే ఉద్యమిస్తామని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట రాజు హెచ్చరించారు. మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట సీపీఎం జిల్లా కార్యాలయంలో కొమురయ్య అధ్యక్షతన వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొమురయ్య, కుమార్, బ్రహ్మచారి, శ్రీనివాస్, బిక్షపతి, మొగిలి, కరుణాకర్ పాల్గొన్నారు

### సీపీగెట్‌లో ర్యాంకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కెమిస్ట్రీ అధ్యాపకులు ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ప్రవేశాల కోసం విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చారు. వివిధ చోట్ల నుంచి శిక్షణ పొందిన విద్యార్థుల్లో కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్టు( సీపీగెట్) ఫలితాల్లో కెమిస్ట్రీలో ప్రవేశాలకు సంబంధించిన వాటిలో పదిలోపు ర్యాంకులు ఐదుగురు సాధించారని కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.

# ధ్వంసమైన ఎస్సారెస్పీ కాల్వ

- ఇరువైపులా బుంగలు
- వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు



ధ్వంసమైన కాల్వ



కాల్వకు పడిన బుంగ

హసన్‌పర్తి : అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపంగా మారింది. ఆరేళ్లుగా కాల్వకు ఇరువైపులా బుంగలు పడి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. నేడు, రేపో ఈ కాల్వకు నీరు వదిలే అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండి పడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే. వరంగల్-పరకాల మార్గ మధ్యలోని డీబీఎం-31 వంగపహాడ్-దామెర శివారులో ఎస్సారెస్పీ కాల్వ దెబ్బతిన్నది.

**నాసిరకంతో చేపట్టిన పనులు**

ఆరేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో కాల్వ దెబ్బతిన్నది. కాల్వకు గండి పడడంతో రూ.30 లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. నాసిరకం పనులు చేపట్టడంతో మళ్లీ పరిస్థితి యథావిధిగా మారింది. గత ఏడాది ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయగా నీరంతా వృథాగా పోయింది. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

**రైతుల ఆందోళన**

కాల్వ మరమ్మతు చేయకుండా మళ్లీ జలాలు విడుదల చేసినట్లయితే పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శాశ్వత మరమ్మతులు చేపట్టాలి**



దెబ్బతిన్న కాల్వకు శాశ్వత మరమ్మతు చేపట్టాలి. ఎస్సారెస్పీ నీరు విడులైనప్పుడు అవి వృథాగా పోతున్నాయి. పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. – ఐలయ్య, రైతు

# పేటెంట్ల నమోదులో ముందుండాలి

- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి



సమావేశంలోమాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : పరిశోధనలకు సంబంధించిన అంశాల్లో పేటెంట్ల నమోదులో కేయూ ముందుండాలని కేయూ వీసీ ఆచార్య కె ప్రతాప్‌రెడ్డి కోరారు. మంగళవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీరైట్స్ అవగాహన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేటెంట్లు, మేధోసంపతి హక్కులను పొందేందుకు నమోదు విషయంలో కేయూ ముందుండేలా ఆచార్యులు కృషి చేయాలన్నారు. పరిశోధకులు తమ సిద్ధాంత గ్రంథాలను పేటెంట్ దిశగా తీసుకెళ్లాలన్నారు. ప్రచురించిన మెటీరియల్ మాత్రమే గాకుండా అనేకఅంశాలు ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ రైట్‌కింద నమోదు చేయవచ్చని తెలిపారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీరైట్స్ సెల్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ రూసాప్రాజెక్టుకింద కనీసంపది పేటెంట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ ఐఐసీటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సంజీవ్, కేఆర్ పాల్ మాట్లాడుతూ మేధో సంపత్తి విలువ ఇప్పుడు ప్రపంచాన్ని నడిపిస్తుందన్నారు. హైదరాబాద్ ఐఐసీటీ సీనియర్‌శాస్త్రవేత్త డాక్టర్ గుర్రపు రాజు మాట్లాడుతూ పేటెంట్ దరఖాస్తు ప్రక్రియ పేటెంట్ నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

# ప్రవక్తను స్మరిస్తే పుణ్యఫలం

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య

ఖిలా వరంగల్: ముస్లీంల ఆరాధ్యదైవమైన మహమ్మద్ ప్రవక్తను స్మరిస్తే పుణ్యఫలమని, ప్రతి ఒక్కరూ మరింత భక్తిభావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. మంగళవారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై విశ్వనాథకాలనీ పోలీస్‌స్టేషన్‌లేన్‌లో హజ్రత్ సయ్యద్ రౌషన్ షహీద్ రహిమతుల్లాహి ఆలై దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఆరీఫొద్దీన్ హుస్సేనియా ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగశాయిపేట పురవీధుల్లో నుంచి జెండాను ఊరేగింపుగా తెచ్చి గద్దె పై ప్రతిష్ఠించారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య హాజరై దర్గాను దర్శించుకున్నారు. అనంతరం పూలు అలంకరించి పట్టు వస్త్రాలు కప్పి సుగంధం చల్లారు. దర్గా కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సయ్యద్ రబ్బానీ, మహ్మద్ ఖదీర్, జావీద్, నవాజ్, నజీర్, రహిమత్ బాబా పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి

హన్మకొండ అర్బన్ : చట్టాలపై ప్రతి మహిళకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని సఖి డీవీ కౌన్సిలర్ పావని తెలిపారు. నగరంలోని జన్‌శిక్షణ్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పావని సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందించే సేవలను వివరించారు. కేస్ వర్కర్ అనూష, జన్ శిక్షణ్ స్టాఫ్, శిక్షకులు, పాల్గొన్నారు.

# రైల్వే కార్మికుల సేవలో మజ్దూర్ నేతలు



మాట్లాడుతున్న మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్

కాజీపేట రూరల్ : రైల్వే కార్మికుల సేవలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఎప్పటికీ ముందువరుసలో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఖాజా బాబా, పి.రవీందర్ అన్నారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ యూనిట్ హౌజ్‌లో సోమవారం రాత్రి యూనియన్ కాజీపేట అన్ని బ్రాంచీల జాయింట్ బీఈసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం నుంచి రైల్వే కార్మికులకు రావాల్సిన హక్కులు, డిమాండ్‌ల సాధనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. యూనియన్ కాజీపేట కో ఆర్డినేటర్ నాయిని సదానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని బ్రాంచీల నాయకులు రాజేందర్, భిక్షపతి, ఆర్.సమ్మయ్య, రాజు, ఇబ్రహీం, శ్రీనివాస్‌యాదవ్, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

# సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి



కార్యశాలలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

హన్మకొండ: ప్రధాని మోదీ 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ సేవా పక్వాడ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సేవా పక్వాడ జిల్లా స్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ సేవా పక్షోత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవ పక్వాడ జిల్లా కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యశాలలో పార్టీ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, ఆర్.పి.జయంత్ లాల్, రత్న లక్ష్మీ, భరత్‌గౌడ్, రాజవీరు, పూర్ణాచారి, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### ఐజేయూఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్

రామన్నపేట : ఐజేయూ వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా శ్రీధర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. శ్రీధర్ నియామకంపై జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్ రావు, కార్యదర్శి మట్టా దుర్గప్రసాద్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు రంగనాథ్ హర్షం వ్యక్తం చేస్తూ శ్రీధర్‌ను అభినందించారు.

### బీజేపీ జెండాను ఎగురవేయాలి

హసన్‌పర్తి : మండలంలోని అన్ని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో పాటు మెజారిటీ సర్పంచ్ స్థానాల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని మండల ప్రభారి, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ప్రక్రియపై మండల స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. జాన్‌పాక, గొర్రెకుంట, స్తంభంపల్లి పారిశ్రామిక ప్రాంతం, కరీమాబాద్ మెయిన్ రోడ్, కామునిపెంట, జన్మభూమి జంక్షన్, శాకరాశి కుంట, రాంలక్ష్మణ్ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అయన ఒక ప్రకటనలో వివరించారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కాజీపేట: గ్రేటర్ పరిధిలోని 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో మంగళవారం రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ ప్రారంభించారు.

### ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్/హసన్‌పర్తి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ, ఏబీఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం చింతగట్టు బ్రిడ్జి వద్ద రహదారిపైన బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

### రోడ్డుపై నాగుపాము కలకలం



హన్మకొండ : నక్కలగుట్ట మెయిన్ రోడ్డుపై టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నాగుపాము కలకలం సృష్టించింది. డివైడర్ మధ్య నుంచి రోడ్డుపైకి వచ్చిన నాగుపామును చూసి కారులో వెళ్తున్న ఓ వ్యక్తి చూసి కారు నిలిపివేశాడు. దీంతో పాము డివైడర్‌పైకి చేరింది. అనంతరం కారు వెళ్లిపోగానే తిరిగి రోడ్డుపైకి చేరుకోవడం వెంటనే ఆటో రావడంతో పాము నుంచి వెళ్లడంతో అస్వస్థతకు గురై కదలలేని స్థితికి చేరుకుంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు చేరుకోవడంతో కొందరు పామును పట్టుకెళ్లే వ్యక్తికి ఫోన్ చేయడంతో ఆయన వచ్చి పామును తీసుకెళ్లారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### విద్యార్థులకు కళోత్సవం పోటీలు

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో మంగళశారం మండల స్థాయి కళోత్సవం పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు డ్యాన్స్, పాటల పోటీలు ,డ్రాయింగ్, గ్రూప్ డ్యాన్స్, సాంగ్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారిని జిల్లాస్థాయి పోటీల కు ఎంపిక చేసినట్లు ఎంఈఓ నెహ్రూనాయక్ తెలిపారు.

### కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

హసన్‌పర్తి: కళల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. మండల స్థాయి కళా ఉత్సవ పోటీలు స్థానిక పీఎం బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కళలు ఒత్తిడిని దూరం చేస్తాయన్నారు.

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

హన్మకొండ కల్చరల్ : ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ – 2025లో నగరానికి చెందిన శివానంద నృత్యమాల నృత్య గురువు బొంపల్లి సుధీర్‌రావు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అతిథులను ఆకట్టుకున్నాయి. మంగళవారం హిమాయత్‌సాగర్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ రాష్ట్ర జైళ్లశాఖ డీజీపీ సౌమ్యమిశ్రా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణ ప్రదర్శనను తిలకించి విద్యార్థులను ప్రశంసించారు.

### డీజిల్‌కాలనీకి మంచినీటి పైప్‌లైన్ వేయాలి

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డీజిల్ కాలనీకి మున్సిపాలిటి తెలంగాణ మిషన్ భగీరథ వాటర్ సప్లై పైప్‌లైన్ వేయాలని మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ నాయకులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

### ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్‌డీ క్యాంపునకు ఎంపికైన విద్యార్థిని

కేయూ క్యాంపస్ : జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ప్రీ ఆర్‌డీ క్యాంపునకు కేయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ బ్రాంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్ అక్షయ పొన్నం ఎంపికైంది. మంగళవారం యూనివర్సిటీలో అక్షయను వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, అకుట్ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భిక్షాలు,అభినందించారు.

### ఉత్తమ ప్రిన్సిపాల్‌ను సన్మానించిన మంత్రి

కాజీపేట: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును కాజీపేట ప్రభుత్వ పారిశ్రాక శిక్షణ సంస్థ (ఐటీఐ) ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావును సన్మానించారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి మంత్రి చేతుల మీదుగా సన్మానాన్ని అందుకున్నారు.

# ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

ప్రజా హక్కుల కోసం పరితపించి పోరాటమే తన ఊపిరిగా జీవిత ప్రస్థానాన్ని తుది వరకు కొనసాగించిన ప్రజాకవి కాళోజి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కాళోజి నారాయణ రావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా కాళోజి నారాయణ రావు చిత్ర పటానికి అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం అతని రచనల్లో ప్రస్ఫుటంగా కనబడతాయన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష అని, తెలంగాణ బాస, యాసలోనే జీవన విధానం ఉన్నదని చెప్పారన్నారు. మాండలిక భాష గొప్పతనాన్ని చాటిన ప్రజాకవి కాళోజీ అని అన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



వరంగల్ క్రైం : కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీ, పోలీస్ అధికారులు



ఖిలా వరంగల్ : కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ పూజ



కేయూలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్



హన్మకొండ అర్బన్: బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం ప్రాంగణంలో..



హన్మకొండ : నివాళులర్పిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సీమ, ఉపాధ్యాయులు



వరంగల్ లీగల్ : జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో..



హసన్‌పర్తిలో...




న్యూశాయంపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



హన్మకొండ కల్చరల్: నివాళులర్పిస్తున్న శివ



హన్మకొండ : నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్




విద్యారణ్యపురి: హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో..

# మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మడికొండ : మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా కడిపికొండ రాజీవ్ గృహకల్ప సమీపంలో పోలీసులను చూసి ఆటోడ్రైవర్ పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకున్నారు. ఆటోలో పరిశీలించగా 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయి. దీంతో అతడిని విచారించగా తన పేరు నర్రా వంశీకృష్ణ అని చెప్పాడు. తక్కువ ధరకు బియ్యం సేకరించి ఎక్కువ రేటుకు విక్రయిస్తానని తెలిపాడు. సుమారు రూ. 6వేల విలువ గల బియ్యంను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ కిషన్ తెలిపాడు.

### ప్రేమపేరుతో వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మడికొండ : అమ్మాయిని ప్రేమించమని వేధిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ కిషన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాజీపేట మండలం కడిపికొండ శాంతినగర్‌కు చెందిన యువతి కిరాణషాపునకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గరిగి శివకుమార్ ప్రేమించమని వెంటపడుతూ ప్రేమించకుంటే చంపుతానని బెదిరించినట్లు అమ్మాయి తల్లికి చెప్పడంతో మంగళవారం ఫిర్యాదు చేయగా అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

కాజీపేట అర్బన్ : మండలంలోని న్యూశాయంపేటలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు ఐలమ్మ విగ్రహానికి బుధవారం ఉదయం 10 గంటలకు పూలమాల వేసి నివాళులర్పించనున్నారు.

# భాషా పండితులకు ప్రమోషన్లు ఇప్పించాం



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట : ఎన్నో వ్యయప్రయాసల కోర్చి జీఓ 2, 3, 40, 110 లను సాధించి రాష్ట్రంలోని, తెలుగు, హిందీ, ఉర్దూ, భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇప్పించామని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పండిత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ భాషోపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.టి.కాంతి కృష్ణ మాట్లాడుతూ సంఘం శతాబ్ది ఉత్సవాలకు పరుగులు తీస్తున్న వేళ భాష అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడే సంఘంగా పండిత పరిషత్ అని తెలిపారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, ప్రమోషన్ పొందిన 10 మంది భాషా పండితులను సన్మానించారు.